


# నెక్లెసు తగవు- పట్టుచీరె తీర్పు

ఆర్.ఎస్.కె.మూర్తి

"అవునే నేనింక బయలుదేరేదా ? ఏమీ మరిచిపోలేదు కదా" అంతా ప్రయాణమై హడావుడి పడ్డారు మూర్తి మేస్టారు.

"మరిచిపోకేం, ముఖ్యమైందే మరిచి పోయారు" ముసిముసిగా నవ్వింది మేస్టారి భార్య.

"ఏమిటే, ఏమిటే మర్చిపోయాను ? పర్సుగాని తీసుకోలేదా ఏమిటి ?" జేబులు తడుముకున్నారు, మేస్టారు.

"పర్సుకాదండిబాబూ, నా బహుమానమే మరచిపోయారు." మధురానుభూతుల ముద్దయిపోయింది–ముసిలావిడ.

"ఓసి నీ అసాధ్యం దొంగలతోలా. ఈ వయసులో యింకానీకు బహుమానాలేమిటే ! సర్లే"

హాయిగా నవ్వింది మేస్టారిభార్య.

"సర్లెండి సంబడం. నడవండి. మళ్లీ వర్షం వచ్చేస్తుంది. నేనేదో చిన్ననాటి ముచ్చట గుర్తుచేస్తే, తగుదునమ్మా అంటూ మడి తగలెట్టేశారు. నడవండి."

*　　*　　*

"మేస్టారూ..."

అమాంతంవచ్చి ... నడుస్తున్న మూర్తి మేస్టారికాళ్లను చుట్టేసుకున్నాడోయువకుడు.

"ఏమిటి రవిబాబూ, ఎమిటైంది ? ఈ ఏడుపేమిటి!" కంగారుపడ్డారు మూర్తి మేస్టారు.

"మేస్టారూ..." మరోసారి నీటికుండ భళ్ళుమంది.

"ఏమిట్రా రవీ! ఏమిటైంది?" కంగారు పడింది మేస్టారి భార్య.

"అబ్బే!... ఏం లేదు... మేస్టారూ!... ఇది... ఇది... ఏడుపు కాదు. ఆనందం" తేలైన ముఖంతో, అమాయకంగా చూశాడు రవిబాబు.

"ఆనందం అంటూ ఆ కన్నీళ్ళేమిట్రా రవీ, అసలు సంగతేమిటి? మీ మేస్టారు ఊరెళుతున్నారు కూడాను" అనునయించింది మేస్టారి భార్య.

"చెప్తాను చిన్న మేస్టారూ! అంతా చెప్తాను. కాసేపు మేస్టారి దగ్గర కూర్చోనివ్వండి" ఆయన కాళ్ళను చుట్టేసుకున్నాడు– రవిబాబు.

ఆనందం ఆక్రమించుకుంటున్న అతని ముఖాన్ని చూస్తూ నిలుచున్నది– మేస్టారి భార్య.

"నాకు ఉద్యోగం వచ్చింది మేస్టారూ !" వేటగాని వలను కొరికేసిన విహంగంలా ఉప్పొంగి పోయాడు– రవి.

"ఓరి నీ అసాధ్యం దొంగల తోలా... ఉద్యోగం వచ్చిందని చెప్పటానికా యింత కంగారు పెట్టేశావు ? ఏదీ! ఆ బ్యాంకు ఉద్యోగం వచ్చిందా ?"

"అయినా, నీకు ఉద్యోగం రాకేం చేస్తుందిరా రవిబాబూ! దానికింత...సర్లే... ఉండు... రెండు సున్ని ఉండలు తెచ్చి పెడ్తాను నోరు తీపి చేసుకుందువు గాని."

(38 వ పేజీ చూడండి)



'జతగాడు' లో కృష్ణ, సంగీత

## నెక్లెసు తగవు—పట్టుచీరె తీర్పు

[14 వ పేజీ తరువాయి]

లోనికెళ్తున్న మేస్టారి భార్యనే చూస్తూ నవ్వుతో మెలికలు తిరిగిపోయాడు — రవిబాబు.

"చిన్నమేస్టారి సున్నివుండలు మూలంగానే నాకీ ఉద్యోగం వచ్చింది మేస్టారూ."

"అదేమిటి రవీ ?"

"చెప్తాను మేస్టారూ, అంతా చెప్తాను."

మేస్టారి భార్య ఆప్యాయంగా నోటి కందించిన సున్నివుండను నములుతూ చెప్పసాగాడు—రవిబాబు.

"నేను గోల్డెను బ్యాంకులో ఇంటర్వ్యూ కెళ్ళాను గదా — అక్కడేమైందనుకున్నారు..."

* * *

"ఓ, అయితే మీరు సిరిపురం స్కూల్లో చదివారన్నమాట" మేనేజరు ప్రశ్న. ఇంటరువ్యూ బోర్డులో ఆయనొక్కరే మెంబరు.

"యస్ సార్ !" రవిబాబు జవాబు.

"అయితే ఆ స్కూల్లో మూర్తి మేస్టారు మీకు తెలిసేవుండాలే ?"

రవిబాబు మౌనం !

"ఏం... మూర్తి మేస్టారు తెలియదా ?"

"వారు తెలియకుండా ఎట్లా ఉంటుంది సార్" రవిబాబు ముక్తసరి సమాధానం.

"మరి ఆ మాట చెప్పటానికేమిటి ?" మేనేజరు అనుమానం.

"మీకు తెలుసా మూర్తి మేస్టారు ?" రవి ఎదురు ప్రశ్న.

"నాకా ? బలేవాడివే. నాకు తెలియకేం !"

"మరింకేం ?" మరీ ముక్తసరి సమాధానం.

ఏదో అర్థమైనట్లున్నది మేనేజరు శశాంకకు.

"ఓ...ఓ... అదా... వెరీగుడ్...వెరీగుడ్..." సంతోష సాగర తరంగాలపై తేలిపోయాడు శశాంక. "గుడ్. మీరలా కూర్చోండి. ఆర్డరు తీసుకు వెళ్దురుగాని."

* * *

మరో సున్నివుండ నోటనుంచుతూచెప్పాడురవి.

"మేనేజరుగారామాట అనంగానే నా గుండె ఎగిరివచ్చి మీ కాళ్ళదగ్గర పడింది మేస్టారూ. ఆర్డరు తీసుకొని వస్తుంటే మేనేజరు ఏమడిగారో తెలుసా ? మా చిన్నమేస్టారు బాగున్నారా — అని అడిగారు మేస్టారూ ! బాగున్నారని అంటే, చేత్తో సున్ని వుండలు సంజ్ఞ చేస్తూ బాగా తినిపిస్తున్నారా — అని నవ్వారు. దాంతో నాకు అర్థమైపోయింది. ఆ మేనేజరుగారు కూడ చిన్నమేస్టారి సున్నివుండలు తిని పెరిగినవారేనని. మరిప్పుడు చెప్పండి — ఈ సున్నివుండలవల్ల నాకు ఉద్యోగం వచ్చిందా, లేదా ?"

మేస్టారి భార్య చేత్తో పట్టుకున్న మరో సున్నివుండను తన నోటికి అందించుకున్నాడు రవిబాబు.

"ఇంతకీ ఎవరా మేనేజరు ?" మేస్టారి ప్రశ్న.

"వారి పేరు శశాంకగారు మేస్టారూ."

"ఓరి నీ అసాధ్యం దొంగల తోలా, ఏదీ మన శశాంకా ? నేనిప్పుడు వెళ్తున్నది అతనికోసమే. అవునూ అతనుండేది వరంగల్లులో కదా. గుంటూరెప్పుడొచ్చాడు ?"

"ఏమో మేస్టారూ, ఎప్పుడొచ్చారో ?... అరే, అదేమిటి శశాంకగారే వచ్చేస్తున్నారే" సంభ్రమంలో పడిపోయాడు రవిబాబు.

* * *


వచ్చిన శశాంక స్ఫురద్రూపి. చిన్నారి. వస్తూనే "హలో రవీ, మీరిక్కడే ఉన్నారే. ఉంటారనే అనుకున్నానులెండి" అంటూ మేస్టారి ప్రక్కన చేరి "చిన్నమేస్టారూ" అంటూ లేగదూడలా ఆమెను పలకరించాడు.

"అవునోయి, నువ్వు వరంగల్లులోకదా ఉండేది. గుంటూరెప్పుడొచ్చావు ?" మేస్టారి ప్రశ్న.

"మొన్ననే వచ్చి ఛార్జి తీసుకున్నాను మేస్టారూ. మేనేజరుగానే అయినా కాస్తంత ప్రమోషన్‌లెండి. రాంగానే ఇంటరువ్యూలు."

"అవును శశీ, రవిని చూడంగానే ఉద్యోగం యిచ్చేశావుట ?"

"చూడంగనే యివ్వలేదు మేస్టారూ,



ప్రొ. ఎన్. వేణుగోపాలరావు [ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్] తాము వ్రాసిన "డైనమిక్స్ ఆఫ్ క్రయిమ్" అనే గ్రంథం తొలి ప్రతిని రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డికి ఇటీవల సమర్పిస్తున్న దృశ్యం

మా మేస్టారి శిష్యుడవునో కాదో తెలుసుకునే యిచ్చాను. మూర్తి మేస్టారు తెలుసా అంటే, వారు మీకూ తెలుసుగా అని సమాధానమిచ్చారు రవిబాబు. దాంతో అర్థమైపోయింది. వాళ్ళ పేరు వీళ్ళ పేరు చెప్పుకొని ప్రయోజనాలు పొందరాదని మీరు నూరిపోసే పాఠం రవిబాబు బాగానే నేర్చుకున్నారని" ఆప్యాయంగ రవి చేతిని అందుకున్నాడు, శశాంక.

"అది సరేరా అబ్బాయి. ఇప్పుడేమిటిలా అనుకోకుండా ఊడిపడ్డావు?" మేస్టారి భార్యకు అందరిని 'ఒరేయ్' అనటమే అలవాటు.

"ఏముంది చిన్నమేస్టారూ, మన రవిబాబును చూడంగానే మీ సున్నివుండలు గుర్తుకొచ్చినై. రెండు తినిపోదామని వచ్చాను. మీరేమో అన్ని రవిబాబుకే పెట్టేస్తున్నట్లున్నారు" గారాబం నెరిపాడు — శశాంక.

"ఓరి నీ అసాధ్యం దొంగల తోలా — మీ చిన్న మేస్టారి సున్నివుండలు అక్షయం కదా — అవి అన్నీ ఒకరికే పెట్టేయటమేమిటి?" శశాంక వీపు నిమురుతూ మేల మాడారు మూర్తి మేస్టారు.

"అయితే యిట్లా ఎల్లకాలం చిన్నమేస్టారి సున్నివుండలు తినటమేనా — కాస్త అమ్మాయిచేత నాకు, మేస్టారికి నాలుగు లడ్లూలు చేయించిపెట్టట మేమైనా ఉందా? అయినా అమ్మాయిని తీసుకొని రాకుండా నువ్వొక్కడివే వచ్చావేమిటి?" సున్నివుండలు అందిస్తూనే సూత్రధారిణి పాత్ర నిర్వహించింది — మేస్టారి భార్య.

"చిన్న మేస్టారూ" ఆనందంగా ఉన్న శశాంక ముఖం వన్నె తగ్గింది. అది గమనించనట్టే మాట్లాడింది, సూత్రధారిణి.

"అవునా శశీ. అసలిప్పుడు మేస్టారు మీ యింటికే బయలుదేరారు — మీ కాపురం ఎట్లా ఉందో చూసొస్తానని. తీరా బయలుదేరుతూ, బహుమానం అంటూ, నా మడికూడ తగలేసేశారు. అది సరేగాని శశీ... నువుకూడ ఈ బహుమానాలూ అవీ అంటూ అమ్మాయిని అల్లరి పెడుతున్నావా —

# నెక్లెసు తగవు—పట్టుచీర తీర్పు

మీ మేస్టారికిమల్లే. అసలే అమ్మాయి బెదురుమనిషి కూడ" నాందీ ప్రస్తావన పలికింది.

"బెదురు మనిషేం కాదు చిన్నమేస్టారూ. పెద్ద బిజినెసు మనిషే. నాకే వ్యాపారపు పాఠాలు చెప్పటం ప్రారంభించింది. వాళ్ళ నాన్నగారి ఆర్థిక పురాణమంతా నాకు అందజేయాలని చూసింది. మా మేస్టారి చలవవల్ల నేను భ్రష్టుడ్ని కాలేదు" కుంకుమ పువ్వును ఎలిపినట్లయింది — శశాంక ముఖం.

నటన ఇక సాధ్యం కాదనిపించినట్లున్నది — సూత్రధారిణికి. అంతలో గంభీరమైంది, మేస్టారి భార్య.

"అదంతా విన్నాం శశీ. అమ్మాయి పుట్టింటి కెళ్ళిందిటగా. అది తెలిసే మీ మేస్టారు నీ దగ్గరకు బయలుదేరారు."

"అవునా మేస్టారూ" అన్నట్లుగా మేస్టారివంక చూశాడు. శశాంక కృతజ్ఞతతో అతని గుండె పూరింపబడినట్లయింది.

"ఇంకా మీకీ వయసులో ఈ ప్రయాణాలు, గొడవలు ఎందుకు మేస్టారూ?" ఆప్యాయంగా వారి చేతులు పట్టుకున్నాడు శశాంక.

"సరేలే, ఆయనకసలు ఇంట్లో ఉంటే క్షణం తోస్తుందా? మా శశాంక ఎట్లా ఉన్నాడో? మన రమకి మొగపిల్లవాడే పుట్టాడేవ్. ఆ అల్లరి గోపీ వెధవ యిప్పుడెంత బుద్ధిమంతుడయ్యాడనుకున్నావు! ఇట్లా రోజుకో కబురుతో నా ప్రాణం తీసేస్తుంటారు. అంచేత ఆయన వెళ్తానంటే చాలు, నేనూ ఊళ్ళకు పంపించేస్తున్నాను - కందువా చేతికిచ్చి" మేస్టారి భార్య సంబరాలు త్రవ్విపోసింది.

"మీరలా అంటారుగాని చిన్న మేస్టారూ, మీకు మాత్రం మా అందరి విషయాలూ తెలుసుకోవాలని ఉండదూ. కందువాతోపాటు ఇన్ని సున్నివుండలు కూడ యిచ్చిపంపుతుంటారు. అవునా?" శశాంక ముఖం మబ్బులీడింది.

"నిజం చెప్పావోయి శశీ. మీ చిన్నమేస్టారు నన్ను బొత్తిగా పోస్టు బంట్రోతులా వాడుకుంటున్నదనుకో."

"అక్కడి కంతా నా అజమాయిషీలో ఉన్నట్లు."

శశాంక ముఖం తేటనైంది — ఈ వృద్ధ దంపతులు ప్రేమానురాగాల కబుర్లు వినటంతో.

"సర్లే ... ఈ కబుర్లేనా ... పిల్లలకేమన్నా నాలుగు మెతుకులు పడేస్తావా? లేక గోలీకాయల సున్నివుండలతోనే వాళ్ళ కడుపులు నిండిపోయినై అనుకుంటున్నావా?"

నవ్వులతో వాతావరణం తేలికైపోయింది.

* * *

భోజనం చేసి, మంచంమీద నడుం వాల్చిన శశాంకకు మేస్టారి భార్య మాటలే మనసులో మెదలినై. సరోజ పుట్టింటికెళ్ళిన విషయం తెలిసి తనకోసం మేస్టారు బయల్దేరారా? అంటే, సరోజను తీసుకురమ్మని ఆదేశిస్తారా? అంటే జరిగిదంతా మేస్టారికి పూర్తిగా తెలియదన్నమాట. వెధవ రాళ్ళనెక్లెసు కోసం తన పరువుకు, మేస్టారి శిక్షణకూ అగౌరవం కలిగించిన సరోజను వారు క్షమించగలరా?

* * *

ఆ రోజు ...

బ్యాంకు నుంచి యింటికెళ్ళేసరికి సరోజ మెళ్ళో తళుక్కున మెరిసింది— రాళ్ళనెక్లెసు. వాళ్ళ నాన్న వచ్చి వెళ్ళారుగదా—యిచ్చి వెళ్ళారేమో అనుకున్నాడు శశాంక. తీరాచూస్తే వాళ్ళనాన్న "ఇప్పించి" వెళ్ళారుట.

సరోజ నాన్నగారు ఆ రోజనసలు బ్యాంకుకే వచ్చారు—మరో నలుగుర్ని వెంటేసుకొని.

తనను చూడవచ్చారని, అల్లుడ్ని తమ స్నేహితులకు పరిచయం చేయవచ్చారని, వారిని సాదరంగా రిసీవు చేసుకున్నాడు—శశాంక.

తీరా ఆయన వచ్చింది — తనచేత తప్పుడు పనులు చేయించటానికి.

"ఈయన మా వూరి పేద జనోద్ధరణ సంఘం ప్రెసిడెంటు. బర్రెలు, గేదెలు అంటూ బ్యాంకులో అప్పులు యిస్తున్నారుగా. ఓ వంద అప్లికేషన్లు తెచ్చారు. తలా రెండువేలు రుణాలిస్తే, అహ ... మన వాడేగా. మన సంగతి మరిచిపోడులే" అదోరకంగా నవ్వారు, మావగారు.

శశాంకకు ఆ నవ్వులో ఏదో కల్తీ కన్పించింది.

అప్లికేషన్లు యిచ్చి వెళ్తే, బ్యాంకు వాళ్ళొచ్చి, గేదెలు అవీ కొనే యివ్వగలరన్నాడు శశాంక.

"మళ్ళీ కొనటాలు అమ్మటాలూ ఎందుకు సార్. ఏకంగా క్యాష్ యిచ్చేస్తే, తమ వాటా తమకు ..." ఈ మాటన్నది ఆ సంఘం ప్రెసిడెంటు.

శశాంకకు తల తిరిగిపోయింది.

పరమ పవిత్రమైన మూర్తిమేస్టారి శిక్షణలో పెరిగినవాడు తాను. ఇంతటి అసహ్యకరమైన మనుష్యులే అతనికింత వరకు తటస్థపడలేదు.

మూర్తిమేస్టారు ఎప్పుడూ చెప్తుండేవారు! "ఒరేయ్ అబ్బాయిలూ, రేపటి జీవితంలో మీరంతా గొప్పవాళ్ళవుతారు. కాని ఎప్పుడన్నా ఎక్కడన్నా తప్పుడుపని చేశారో, నేనే లోకంలో ఉన్నా, మీ

శివులు మెలేస్తాను. మీ చిన్నమేస్టారు మీకు సున్నివుండలు పెట్టరు. తెలుసా. గుర్తుంచుకోండి."

అటువంటి పవిత్రతలో పెరిగిన తనను ఇప్పుడీ మామగారు జాతి సంపదను స్వార్థపరులపాలు చెయ్యమంటున్నారు. దేశద్రోహం నెరవమంటున్నారు.

ఏం మాటలు చెప్పి, మామగారిని అక్కడి నుంచి మర్యాదగా బయటకు పంపించాడో శశాంకకు తెలియదు.

తీరా ఇంటికొస్తే సరోజ మెళ్ళో నెక్లెసు. ఆ సంఘం వారిచేత వాళ్ళనాన్న యిప్పించారుట!

వాళ్ళనాన్న చెప్పిన "వ్యాపార సందేశం" తనకు సరోజ అందజేస్తుంటే శశాంక జీవనాడుల నెవరో మెలిత్రిప్పినట్లయింది. అవును, సరోజపై చేయి చేసుకున్నమాట నిజమే! భర్త మనసు తెలియకుండా ప్రవర్తించటంగాక "ఇప్పుడే నాలుగు రాళ్ళు వెనకేసు కోవాలండి" అంటూ తనకు మామన్ (ధనదేవత) పురాణం చెప్తుందా?

ఆమె అంటే తనను కాదని పుట్టింటికి వెళ్ళింది కాని తానామెను కాదనుకోలేదే! పవిత్రమైన తమ వివాహబంధానికి ద్రోహం తలపెట్టలేదే!

మేస్టారు మాత్రం యివన్నీ తెలిసి సరోజను మన్నిస్తారేమిటి?

మంచంమీద శశాంక ఆలోచనలతో సతమతమై రోజు గడిపాడు. ఆ రోజంతా మళ్ళీ మేస్టారు ఆ విషయమే తన వద్ద ఎత్తకపోవటం మరింత బాధ కలిగించింది—శశాంకకు.

* * *

ఏ తెల్లవారుఝామునకోగాని నిద్రపట్టని శశాంక నిద్రలేచేటప్పటికి బాగా ప్రొద్దెక్కిపోయింది. మొగమదీ కడుక్కొని వచ్చేసరికి మేస్టారప్పుడే ఎక్కడికో ప్రయాణమవుతున్నారు.

"ఇదిగో రవీ, మన శశాంక నాలుగురోజులు సెలవు వ్రాసి యిస్తాడుగాని, తీసుకెళ్ళి బ్యాంకులో యివ్వు. నువ్వు మాత్రం మళ్ళీ ఆదివారం రావాలి సుమీ. మన ఇంగ్లీషు మేస్టారు లేరూ, వాళ్ళమ్మాయిని నీకిస్తామంటున్నారు. నువ్వొచ్చి పిల్లను చూస్తే, తర్వాత నేవెళ్ళి మీ అమ్మా, నాన్నతో మాట్లాడుతాను. సరే, నేను వెళ్ళిరానా?"

"జాగ్రత్తగా వెళ్ళిరండి. సాయంత్రానికల్లా వచ్చేయండి. మళ్ళీ ప్రొద్దుటా అదీ అంటారేమో—నేను వంటచేసి ఉంచుతాను" చిన్నమేస్టారి వీడ్కోలు.

ఈ ప్రయాణం ఏమిటో, పెళ్ళికబుర్లేమిటో, సెలవు పెట్టటాలేమిటో ... ఏమీ అర్థం కాలేదు రవి, శశాంకలకు.

"నా కిప్పుడే పెళ్ళేమిటి చిన్నమేస్టారూ, నే నిప్పుడే చేసుకోను" బుంగమూతి పెట్టాడు రవిబాబు.

"ఆయన దగ్గర మాట్లాడకుండా, నాతో చెప్తేనేమిట్రా? ముందా సెలవు తీసుకొని, ఉద్యోగానికెళ్ళు. బస్సు తప్పిపోయేను."

"ఉహు నేనుండలేను. నాలుగు రోజులు నేనిక్కడ ఉండలేను చిన్నమేస్టారూ!" శశాంక పేచీపెట్టాడు — సెలవు చీటీ వ్రాసి యిస్తూనే. వాళ్ళ గారాబమంతా ఆమె దగ్గరే కదా!

"ఏం, ఎందుకని ఉండలేవు? ఏమిటి నీ కిక్కడుంటే కష్టం?"

"కష్టం — కాదు. కష్టాలు. బహువచనం. లిస్టు చెప్పమన్నావా? ఒకటి — నేను రోజూ గడ్డం చేసుకోవాలి. ఇవ్వాళ అష్టమి, రేపు మంగళవారం, ఎల్లుండి పర్వదినం అంటూ ఆడవి పెంచమంటారు—మాస్టారు.

నెంబరు టు — మరి మీరు కోప్పడకూడదు. నేనిప్పుడు కాఫీ కాస్త ఎక్కువగా తాగుతున్నాను, చిన్నమేస్టారూ. మేస్టారేమో కాఫీ త్రాగితే కోప్పడ్తారు కదా!

ఇక నెంబరు త్రి — బాబోయి, పెద్దకష్టం. మహాకష్టం. ఈ వూళ్ళో సినిమాలు లేవు. నాలుగు రోజులు సినిమా చూడకుండా... బాబోయి... చిన్నమేస్టారూ, మీరెట్లాగైనా చెప్పి, నన్ను పంపించేసెయ్యాలి."

## పడమటిల్లు

మధుమాసం పోతోందని
మావిపైన కోకిలా
మూగవోతి వెందుకే ... ?

తొడిమ వీడి పడిపోయిన
పూవు కొరకు తుమ్మెదా
విరహగీత మెందుకే ... ?

శిశిరమందు పడిరాలిన
పండుటాకు చోటులే
పూలకారు చివురుల
పురిటికి పొత్తిళ్ళలే ...

పడమటింటి పడగ గదికి
సూరీడే పోయినా
తీపిరేపు రూపానికి
సుప్రభాత సుద్దుటకే ... !

— సౌందర్యశ్రీ

"ఇవేకదా నీ కష్టాలు. సర్లే విను. నువ్వు రోజూ గడ్డం చేసుకోవద్దు. అసలు మేస్టారే నిన్ను చేసుకోమంటారు. ఇక కాఫీ అంటావు — ఎట్లా ఉంది, ఎవరు కలిపారు అన్న ప్రశ్నలు వెయ్యకుండా, బుద్ధిగా త్రాగితే ఎన్నిసార్లయినా త్రాగవచ్చు. మూడోది — మేస్టారు చెప్పినట్లు వింటే మీరు టౌను కెళ్ళి సినిమాకూడ చూసిరావచ్చు. సరేనా."

"మీరు — అంటే?"

"అదేలే, లేచి త్వరగా, ఆగడ్డమేదో చేసుకొని, స్నానం చేసి, శుభ్రంగా ఉండు. మీ మేస్టారువాళ్ళూ పెందలాడే వచ్చేస్తారు."

"మేస్టారువాళ్ళూ అంటే — వాళ్ళెవరు?"

"అదేలే, మా బంధువులమ్మాయి ఓ అమ్మాయి ఉందిలే. ఆ అమ్మాయిని తీసుకురావటానికేగా మేస్టారు వెళ్ళారు. సర్లే. నా కొంగు వదులు. పెళ్ళిళ్ళయి కాపురాలు చేసుకుంటున్నా... నేను వంట చేసుకోవాలి. మళ్ళీ ఆకలంటూ గోల పెడ్తావు."

* * *

శశాంకకు అర్థమైంది. మేస్టారు వెళ్ళింది సరోజను తీసుకురావటానికే.

అంటే, మేస్టారికి సరోజ బుద్ధి తెలియదన్న మాట. ఆమె వస్తుందనే వారి ఆశ కాబోలు!

సాయంత్రానికల్లా వరండాలోకి చేరిన శశాంకకు మనసు సుడిగుండాలు తిరిగింది. ఒకవేళ సరోజ వస్తే తనతో మాట్లాడుతుందా? తాను మాట్లాడక పోతే చిన్నమేస్టారు ఊరుకుంటుందా? ఏ మొగం పెట్టుకొని తానామెతో మాట్లాడగలదు? ఎంత ధీమాగా వెళ్ళిపోయిందో!

ఇంతలోనే సరోజతో బండి దిగారు — మూర్తి మేస్టారు.

అరే, సరోజ! ఎంత బేలగా ఉందో! ఏమైపోయిందో ఆమె ధీమా అంతా! తనవంక ఆమె చూసిన చూపుల్లో వేల ఆశలు బలహీనంగామెరిసినై.

"వచ్చావా సరోజా! రామ్మా... రా... మన శశాంక వచ్చాడు చూశావా?" అంటూ ఆమెను లోపలికి తీసుకెళ్ళింది, మేస్టారి భార్య.

లోపల వాళ్ళ కబుర్లు వరండాలోకి విన్పిస్తూనే ఉన్నాయి.

"నాల్రోజులు సెలవు పెట్టమని నాళ్ళ మేస్టారంటే, నేనీ ఊళ్ళో ఉండలేనని నా దగ్గర గారాబం చేశాడు. ఏం చేసేది — వాడు పెట్టిన షరతులన్నీ ఒప్పేసుకొని, ఉంచేశాను" అంటున్నది మేస్టారి భార్య. సరోజ మాటలు మరిచిపోయిందా?

"ఇదిగో, ఏమేవు... విన్నే" గుడ్డలు విప్పకుంటూ, ఆగకుండా కేకలు పెట్టారు హాల్లో మేస్టారు.

"వచ్చె... వచ్చె... ఏమిటలా ఊపిరి తిప్పకోనివ్వరు?"

"ఏంలేదు, కోడలు సంబరంలో పడిపోయావేమోనని ఇంతకీ వంట కానిస్తున్నావా, లేదా? శశాంక అసలే ఆకలికుండలేడు."

"అక్కడికి మీరు మహా ఉండగలిగినట్లు. అమ్మాయి కూడ ఉందిగా — ఎంతసేపట్లో చేస్తేనేమిటి?"

* * *

నేను తర్వాత తింటానులెండని ఎంత గోల పెట్టినా... భార్యనుకూడ తమతోపాటే ఆ రాత్రి భోజనానికి మేస్టారు ఎందుకు కూర్చోపెట్టారో ముందు తెలియలేదు — శశాంకకు.

సరోజను తన ప్రక్కన కూర్చోపెట్టటానికే వారా పని చేశారని తర్వాతగాని అర్థంకాలేదు అతనికి.

అన్నం తింటున్నంతసేపు సరోజనే గమనిస్తున్నాడు — శశాంక. ఎంత సింపిల్‌గా, అమాయకంగా ఉందో! పలకరిస్తే, నెత్తిన గంగ దిమ్మరించేటట్లున్న దీనత్వం! ఏమిటీ మనిషిలో వచ్చిన మార్పు? ఎట్లా వచ్చిన మార్పిది?

"ఏమిటమ్మా, నీకా గారెలు నయించటం లేదా? శశాంకకు వేసేసెయ్యి. మనకు నచ్చవుగావి, వాళ్ళ చిన్నమేస్టారు ఏంచేసినా వాళ్ళకు అమృతమే" మేలమాడారు — మేస్టారు. మురిపెపు మేలం మాత్రమేనా అది!

"అక్కడికి మీకేదో అవి విషమైనట్లు!" మేస్టారి భార్య కవ్వింపు.

"సరే. తాళి కట్టావుగదా — తన్నినా పడాలన్నదిట వెనుకటికి నీలాంటి ఓ సత్యభామ. తప్పుతుందామరి. విషమైనా తప్పదు. గరళమైనా తప్పదు."

మేస్టారి మాటల్లో ఏదో మహత్తర సందేశం! తన్నినా పడ్డాడు శ్రీకృష్ణుడు. సరోజ తనను తన్నలేదుగా. తానే చేయి చేసుకున్నాడు. మనసంతా చల్లనైంది — శశాంకకు.

అయితే మేస్టారికి పూర్తిగా విషయమంతా తెలియదు గదా! తెలిస్తే వారు సరోజను క్షమిస్తారా? వారు క్షమించని సరోజను తాను మాత్రం ఎట్లా క్షమించగలడు?

వేడెక్కినయి—శశాంక ఆలోచనలు.

* * *

"నేనట్లా చల్లగాలికి డాబామీద పడుకుంటాను మేస్టారూ" అన్నాడు శశాంక.

"ఏమిటే డాబామీద పడుకుంటావా? పడుకో. నాకేం తెల్లవారేటప్పటికి రెండు తుమ్ములు. జలుబు చేసిందని మీ చిన్నమేస్టారు ఇంత మిరియాల కషాయం తాగిస్తుంది. రెండురోజులు సున్నివుండలు బంద్!"

తనకు మాట్లాడే అవకాశమే యివ్వకుండా, అన్నీ యిట్లా సహజధోరణిలో నడిపిస్తున్న మేస్టారి ధోరణి శశాంకకు వింతగా తోచింది. అసలు విషయం చెప్పే అవకాశమే యివ్వరేమిటి, మేస్టారు?

* * *

"అబ్బాయి, అప్పుడే కునుకు పట్టిందేమిట్రా. మీ మేస్టారికి ముసలిముప్పున కొత్త కోర్కెలు పుట్టుకొస్తున్నాయి. అమ్మాయి చేతి తాంబూలం వేసుకుంటారుట."

"అమ్మాయి"ని మధ్య పెట్టుకొని, గదిలో కొచ్చారు, మేస్టారి దంపతులు. అక్కడున్నవేమో రెండే కుర్చీలు. సరోజకు మంచంమీద చోటివ్వక తప్పలేదు.

"ఇదిగో అమ్మాయి, కావాలంటే మీ మేస్టారికి ఎంత సున్నమైనా రాయి. ఆయనసలు సున్నమే బొక్కుతారు. శశికి మాత్రం జాగ్రత్తగా రాయి. వాడి నోరు ఊరికే ..."

"ఓసి నీ అసాధ్యం దొంగల తోలా, అదేమిటే, ఏదో కొత్తవాళ్ళకు చెప్పినట్లుచెప్తావు. అమ్మాయికి శశి సంగతి తెలియదా? ఛస్తున్నానోయి శశీ, మీ చిన్నమేస్టారి చాదస్తంతో" ఉస్సురన్నారు మేస్టారు.

"ఆ చావులో ఎంతో హాయి ఉంది మేస్టారూ. లేనిపోని తెలివితేటలు కంటే ఆ చాదస్తమే ఎంతో మంచిది" ఇప్పటికి నోరువిప్పాడు శశాంక. ఇకనైనా తనను మాట్లాడనిస్తారా?

"ఓరి నీ అసాధ్యం దొంగల తోలా. ఎంతైనా మీరూ మీరూ ఒకటే. అది సరేనోయి శశీ. నీకీ సంగతి తెలుసా. ఈ తాంబూలపు చిలుకలున్నాయి చూశావా—యివి భలే మంచి రాయబారులోయి—మన అంగదుడు, విదురుడు, వాజ్‌పాయిల కంటే. ఒకసారి ఏమైందంటే, ఈ చాదస్తం ..."

"సర్లెండి, ఏమిటా కబుర్లు, పిల్లల దగ్గర" చిన్నమేస్టారు అందంగా కసురుకొంది.

"పిల్లల దగ్గర కాకపోతే, ఇవి నువ్వూ, నేనూ కూర్చొని చెప్పుకునే కబుర్లేమిటి? ఒకసారి ఏమైందంటే శశీ—మీ చిన్నమేస్టారికి పట్టుచీరెమీదకు మోజు పోయింది. సరిగ్గా అదే సమయంలో పబ్లిక్ పేపర్సు దిద్దటానికై వచ్చినై. అప్పుడు మంది మద్రాసు రాష్ట్రంగా. ఆ కోయంబత్తూరు వాళ్ళు ఎట్లా పట్టారో, అడ్రసు పట్టుకొని వచ్చారు — మార్కుల కోసం. వచ్చిన వాళ్ళు ఊరికే వచ్చారా? కోయంబత్తూరు పట్టుచీరెలో బొత్తి పట్టుకొచ్చారు. అందులో ఒకటి మంచిది ఎన్నుకొని, మీ చిన్న మేస్టారు కట్టేసుకుంది కూడ.

తర్వాత విప్పి వాళ్ళ ముఖాన కొట్టిందిలే. తర్వాత పాపం, పదిరోజులు నా ముఖం చూడలేక— చివరకు యిదిగో ఈ చిలుకలతోనే రాయబారం పంపించింది. చిలుకలతోపాటు వేలు కొరికితే — 'అమ్మయ్య! శిక్ష విధించారుగా, ఇక మాట్లాడండి'— అంటూ మీద ..."

## చిరునామాలు: మనవి

పత్రికలో పడ్డ రచయితల చిరునామాలు కావాలని వ్రాయవద్దని మనవి. మీరు వారికి వ్రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం అని వ్రాసినట్లయితే — మా కార్యాలయం వాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు వ్రాయవద్దని మనవి.

— సం॥

"ఏమి ... యిక ఆపుతారా, ఆపరా? ఏమిటా పిల్లలతో పాడుకబుర్లు. లేవండి. పోదాం. వాళ్ళు పడుకొంటారు. శశాంక అసలే నిద్ర ఆపలేడు."

లేచి వెళ్ళబోతున్న మేస్టారిని ధైర్యం చేసి అడిగాడు శశాంక—"అంత మాత్రంతోనే చిన్న మేస్టారు చేసిన తప్పును క్షమించేశారా మేస్టారూ?"

"అదేమిటోయి — అలా అంటావు. మన సూత్రాలు, మన ఆదర్శాలు మనం సుఖంగా ఉండి, నలుగురిని సుఖ పెట్టటానికేగాని, పంతాలకు పోయి పాడుచేసుకోటానికా? అదీగాక ఆదర్శ మార్గాన నడిచే వ్యక్తి అందరికంటె అడుగు ముందుగా ఉంటాడు. అతగాడు ఆగి చూచుకోవాలి. వెనక వస్తున్నవాళ్ళను వెంట కలుపుకోవాలి. అందులో భార్యామణిగారంటే ... జోడెద్దు గదా! జంటగా నడవ వద్దూ? సర్లే, పడుకోండి. ప్రొద్దు పోతోంది."

* * *

కోయంబత్తూరు పట్టుచీరె కథ ఎంత హృద్యంగా చెప్పారు మేస్టారు! శశాంక ఊహలకు విశాలత్వం ప్రాప్తించింది. సో...సరోజ చేసిందంతా తెలిసే మేస్టారామెను క్షమించారన్నమాట.

ఇక తనకు మాత్రం ఆమెపై కోపమెందుకు? తప్పు దిద్దుకునే అవకాశం సరూకు ఇవ్వకపోతే ఎట్లా?

* * *

చిలుక అందించిన సరోజ వేలు వెనుకకు పోలేదు. "ఏమిటే, వ్రేలు తియ్యవా?" శశాంక లాలన.

"ఊహు, శిక్ష విధించండి మరి" సహజ అభ్యర్థన.

"ఏం శిక్ష?"

"అదే మేస్టారు చెప్పిన శిక్ష. భార్యలు చేసే తప్పులకు భర్తలు వేయాల్సిన శిక్ష."

"అమ్మో, అంత పెద్ద శిక్షే! నా అందాల సరూకి నేనంత శిక్షను వెయ్యలేను బాబూ."

"వెయ్యాలండి — ఇంకా అంతకుమించిన శిక్షను వెయ్యాలి. శిక్ష మీ సరూకు కాదు. ఆమెలో గూడు చూసుకున్న ఆశా పిశాచానికి. దాన్ని చీపురు దెబ్బలు కొట్టినా తప్పులేదండి."

"పిశాచం పారిపోయిందిగా — మేస్టారి మంత్రంతో. ఇప్పుడిక మిగిలింది న అందాల సరూనే. ఆమెకు నేను వేసే శిక్ష యిది!"

తాంబూలం వేసుకోకుండానే సరోజ పెదవులు ఎర్రబడినై. కసిగా రక్తం చిమ్మినై.

* * *

"ఏమిటమ్మా... ఎన్నిసార్లు తాగుతాడుట మీ ఆయన కాఫీ?" అంటున్నది మేస్టారి భార్య.

"ఏమోనండి. మీరే చెప్పారటగా — ఎన్నిసార్లయినా త్రాగవచ్చని. ఊరికే నా ప్రాణం తీస్తున్నారు" సరోజ పితూరీ.

"సరూ... కాసిని వేడినీళ్ళు పట్టుకురా. గడ్డం చేసుకోవాలి" అంటూ వచ్చాడు శశాంక.

"ఒరేయి, ఒరేయి యివ్వాళ మంగళవారంరా."

"చిన్నమేస్టారూ, చిన్నమేస్టారూ... మాట తప్పుతున్నారు. నేను సెలవుపెట్టి ఉంటే..."

"సర్లే అయితే నువ్వా సెలవు మానేసి వెళ్ళిపో, భడవకానా అని."

"పద సరూ... ఇప్పుడే వెళ్ళిపోదాం."

"సరూ ఏం రాదు. అమ్మాయి నాలుగు రోజులు నాదగ్గరుండి వస్తుంది. నువ్వెళ్ళు."

"అమ్మో, సరూ రాందే నేను పోకేం. నేనూ యిక్కడే ఉంటాను."

"అయితే బుద్ధిగా ఉండు. ఆ షేవింగు సెట్టు తీసేసి, బుద్ధిగా వెళ్ళి స్నానం చెయ్యి. అమ్మాయి, ఆ కాఫీ ఫ్లాస్కులో పోయి. మధ్యాహ్నం త్రాగుతాడు."

"చిన్నమేస్టారూ..." గీపెట్టాడు శశాంక.

"సరే, నేనలా కాసేపు బయట తిరిగొస్తాను. సరూని నా బహుమానమన్నా యివ్వమనండి" కవ్వించాడు — శశాంక.

"బహుమానం సరూ యివ్వదు శశీ. నువ్వే యివ్వాలి. ఏమే అంతే కదూ!" మూర్తి మేస్టారు ముద్దు చేశారు.

"సర్లెండి, పాడు మాటలు మీరూను. పిల్లలున్నారనైనా లేకుండా..." మురిపెం చూపింది మూర్తి మేస్టారి భార్య.

రాళ్ళనెక్లెసు తగవును కోయంబత్తూరు పట్టుచీరె తీర్చేసింది. ★